
# కోరిక



దీపావళి కథల పోటీలో బహుమతి రు.600 పొందిన కథ

## "ఏవండీ .... వచ్చే నెలలో మన ఎదురింటి అనసూయా వాళ్ళంతా కాశీ వెళతారట"

**వెల రోజుల క్రితం మాణిక్యం అన్న మాటలు గుర్తొచ్చాయి మాధవరావుకు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.**

కాశీ వెళ్ళాలన్న మాణిక్యం కోరిక ఈనాటిది కాదు గుమస్తాగా జీవితం వెలగబెడుతున్న రోజుల్లో మాధవరావు జీవితంలోకి అడుగు పెట్టింది మాణిక్యం.

అప్పటి నుంచి రోజులు, నెలలు, సంవత్సరాలు కష్టమైనా, సుఖమైనా భరిస్తూ బ్రతుకు బాటలో అతనితో నడిచింది. ఇద్దరు అమ్మాయిలకు, ఇద్దరుఅబ్బాయిలకు తల్లియి వారి ఆలనా, పాలనా చూసుకుంటూ భర్తకు ఏ వేళకు ఏది కావాలో దగ్గరుండి చూస్తూ మాతృమూర్తిగ, మమతల పాలవెల్లిగ మెలిగే మాణిక్యం నాకు ఫలానిది కావాలని ఏ రోజూ అడగలేదు.

అమ్మాయిలకు పెళ్ళిళ్ళయ్యాయి.

అబ్బాయిలు చదువుకుంటున్నారు.

మనవరాళ్ళను ఎత్తుకున్న మాణిక్యానికి ఆరోజు ఎందుకో ఒక కోరిక పుట్టింది.

"ఏవండీ... మనమొకసారి కాశి వెళదామండీ" అంది మాణిక్యం భర్తతో నెమ్మదిగా.

మాధవరావు నవ్వి ఊరుకున్నాడు.

ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు తీరిక ఉండేది కాదు. అన్ని పనులూ మాణిక్యం చెయ్యవలసిందే! యంత్రంలా పనిచేస్తున్న భార్యను చూస్తుంటె జాలి కలిగేది మాధవరావుకు.

గానుగెద్దు లాంటి జీవితం. ఎప్పుడు ఆమెకు విశ్రాంతి?

ఓ పది రోజులు తీర్థయాత్రలకు తీసుకు వెళ్ళి భార్యకు అన్నీ చూపించాలని ఉండేది మాధవరావుకు. కానీ ఏదో ఒక ఖర్చు అడ్డుపడి భార్య కోరిక తీర్చలేక పోయేవాడు.

ఆ వీధిలోని వారెవరైన యాత్రలకు వెళుతున్నామని చెప్పితే మాణిక్యం తృణమో, పణమో ఇచ్చి దేవుడి కివ్వమనేది. వారు తిరిగి రాగానే ఆ క్షేత్రాల గొప్పదవాన్ని చెబుతుంటె విని తన్మయత్వం చెందేది. వాళ్ళిచ్చిన ప్రసాదాన్ని ఇంట్లో అందరికీ ఇచ్చేది.

"మాణిక్యం ... పెద్ద కోడలు రాగానే బాధ్యతలన్నీ అప్పజెప్పి అప్పుడు మనం కాశీ వెళదాం".

అనేవాడు మాధవరావు.

ఆ మాటకే పొంగిపోయేది మాణిక్యం.

పెద్దకొడుకు సత్యం ఉద్యోగస్థుడవడం, మాధవరావు ఉద్యోగంలోంచి రిటైరవడం ఒకేసారి జరిగాయి. అప్పటి నుంచి ఆదాయం తగ్గడం...ఖర్చులు పెరగడం. పెన్షను డబ్బు అమ్మాయిల పెళ్ళిళ్ళకు చేసిన అప్పు తీర్చడానికి సరిపోయింది.

సత్యానికి పెళ్ళి చేస్తే కోడలొస్తుంది. అప్పుడు ఎంచక్కా యాత్రలకు వెళ్ళవచ్చునని మాణిక్యం ఆశ. కొడుకు పెళ్ళి కోసం భర్తను తొందరపెట్టేది.

"ఏవండీ ... అబ్బాయికి కనీసం ఐదు వేలైనా కట్నం వచ్చే సంబంధం చూడండీ. పెళ్ళి ఖర్చులకు పోగా ఒక వెయ్యి రూపాయలైనా మిగులుతాయి." అంది మాణిక్యం.

"అప్పుడు అప్పు చెయ్యకుండా మనం కాశీ వెళ్ళి రావచ్చు...అంతేనా"

మాధవరావు అలా అనగానే తలదించుకుంది మాణిక్యం.

"మాణిక్యం ..మన కింకా చాలా బాధ్యతలున్నాయి. పెద్దోడు ఒకింటి వాడవగానే సరిపోయిందా! చిన్నోడి చదువు పూర్తిచేయాలి వాడికో దారి చూపించాలి"

భర్త మాటలకు మరిక ఏదీ అడగలేక పోయింది మాణిక్యం.

కాపురానికి వచ్చిన కొద్ది రోజుల్లోనే భర్త మనసును చదవగలిగింది. కన్నందుకు పిల్లలందరినీ సమానంగా చూడాలి. పిల్లలు మనస్తత్వాల కనుగుణంగా వారిని తీర్చిదిద్దాలి. వారికో దారి చూపించాలి. అప్పుడే తండ్రిగ బాధ్యతలను నెరవేర్చిన వాడవుతాడు. ఇదీ భర్త సిద్ధాంతం. అందుకే ఏ విషయంలోనూ భర్తను నొప్పించడం గాని, మాట విసరడం గాని చేసేది కాదు. భర్తను అనుసరించేది.

కానీ...కాశీ వెళ్ళాలన్న కోరిక కలిగింది.

పరిస్థితులు అన్నీ చూస్తున్న మాణిక్యం అడిగి భర్తను బాధపెడుతున్నానని మనసులో అనిపించినప్పుడు మాత్రం, మరోసారి ఆ ప్రసక్తి భర్త దగ్గర తెచ్చేది కాదు—

మాణిక్యం అలా ఆలోచిస్తుంటె మాధవరావు భార్య గురించి ప్రతిసారి మనసులో అనుకునేవాడు.

ఎప్పుడూ పిల్లల గురించే గాని తన గురించి ఒక్కసారైనా ఫలానిది కావాలి అడగడం అతనెప్పుడూ వినలేదు. పిల్లలు చిన్నప్పుడు కొంత డబ్బు ఆమెకిచ్చి "మాణిక్యం ...నువ్వొక మంచిచీర కొనుక్కో" అనేవాడు.

"మంచి చీరకు అంత డబ్బు ఎందుకు వృధా చెయ్యడం. ఒక సాదాచీర కొనుక్కొని మిగిలిన డబ్బులు పిల్లలకు బట్టలు తియ్యవచ్చు" అనేది.

అటువంటి భార్య కోరిన ఒకే ఒక కోరిక తీర్చలేక పోతున్నాడు తను. తన అసమర్థత మీద తనకే అసహ్యం వేస్తుందప్పుడప్పుడు.

మాధవరావు మంచి సంబంధం చూసి సత్యానికి పెళ్ళి చేసాడు.

కమల కోడలుగా వచ్చింది.

కాశీ యాత్ర గురించి మరోసారి భర్త చెవిలో ఊదింది.

అయితే అప్పటికే కొడుకు, కోడలు హనీమూన్ వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు.

"నాన్నగారూ... మరోలా భావించవద్దు. మీరు ఏమీ అనుకోకనే మేమిద్దరం ఓ వారం రోజులు అలా తిరిగి రావాలనుకున్నాం. డబ్బు గురించి ఇబ్బంది లేదు. కట్నంలో కొంత మిగిలింది. అదే తీసుకుని వెళతాం"

సత్యం అలా అనగానే మరి మాట్లాడలేదు మాధవరావు.

మాణిక్యం ఆశ నిరాశయ్యింది.

అయినా బయటకు వ్యక్తం చెయ్యలేక పోయింది.

"పోనీలెండి...కొత్తగా పెళ్ళైన వాళ్ళు సంబరపడుతున్నారు." అంది.

కొడుకును, కోడలును సంతోషంతో సాగనంపింది.

వారం రోజులు అలా అలా తిరిగి వచ్చిన కొడుకు, కోడలును దగ్గర కూర్చోబెట్టుకుని చూసిన ప్రదేశాల గురించి చెప్పమంది.కోడలు అన్నీ చెబుతుంటె మాణిక్యం గుండెల్లో మళ్ళీ కోరిక మొలకెత్తడం ప్రారంభించింది.

పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు కదా !

పెద్దమ్మాయి, చిన్నమ్మాయి మళ్ళీ పురుళ్ళు పోసుకోడానికి రావడంతో ఖర్చులు పెరిగాయి. మాధవరావుకు వస్తున్న పించను, సత్యం జీతం పోగా ఇంకా అప్పు చేయవలసి వస్తోంది.

ఇద్దరమ్మాయిలకు పురుళ్ళుపోసి, పిల్లలకు బారసాల చేయించి అత్తారిళ్ళకు పంపేసరికి అప్పుల్లో మునిగిపోయాడు మాధవరావు. సత్యం కూడా అప్పుచెయ్యక తప్పలేదు.

ఏం చెయ్యాలో తోచని పరిస్థితి.

రోజులు పరిగెడుతున్నాయి.

కొడుకు తండ్రయ్యాడు.

మనవడిని ఎత్తుకుని మురిసిపోయింది మాణిక్యం.

"ఏవండీ ... మనవరాళ్ళను, మనవడిని చూసాం. బ్రతుకుతామో, లేదో...కాశీ వెళదామండీ." అంది మాణిక్యం.

మాధవరావు ఏం చెప్పలేక పోయాడు.

అమ్మ కోరికను చాలా సార్లు విన్న సత్యం అమ్మను,నాన్నను కాశీ పంపించాలనుకున్నాడు. అయితే కాశీ ప్రయాణం అంటే మాటలా! మరేవి చూడకుండా ఒక్క కాశీ ఇద్దరు మనుష్యులు వెళ్ళి రావాలంటే కనీసం వెయ్యి రూపాయలైనా కావాలి...ఎలా...?

ఆఫీసులో ఐదువందలరూపాయలకు లోన్ పెట్టి వచ్చిన డబ్బును తండ్రి చేతికిచ్చాడు.

"నాన్నగారూ ... మీదగ్గర ఈ ఐదు వందలూ ఉంచండి. ఓ వారంలో మరికొంత సొమ్మును చూసిస్తాను. అమ్మను కాశీ తీసుకు వెళ్ళి చూపించండి."

మాణిక్యం పొంగిపోయింది.

ప్రక్కింటి వాళ్ళతో, ఎదురింటి వాళ్ళతో చెప్పేసింది కొడుకు కాశీ పంపిస్తున్నాడని.

కానీ మాణిక్యం కోరిక కోరికగానే మిగిలిపోయేలా ఉంది.

బి.ఎస్సి., ఫైనలియర్ చదువుతున్న రెండో కొడుకు ఆరోజు అన్నయ్య దగ్గరకొచ్చి అసలు విషయం చెప్పాడు, జూలాజికల్ టూర్ వెళ్ళాలని. టూరు వెళ్ళకపోతే పరీక్షల్లో కూర్చోపెట్టరని మరీ చెప్పాడు.

సత్యం ఆలోచనల్లో పడ్డాడు

తండ్రికిచ్చిన డబ్బు ఎలా అడగాలి?

కాశీ వెళుతున్నామని పొంగిపోతున్న అమ్మ ఆనందాన్ని ఎలా ఆపగలడు ?

మళ్ళీ అప్పు...ఎలా...

అంతా చూస్తున్న మాణిక్యం భర్త దగ్గరనుండి డబ్బు తీసుకుని కొడుక్కిచ్చింది.

"ఒరేయ్ సత్యం...ఈ డబ్బిచ్చి తమ్ముడును టూరుకు పంపరా. మేము ఈవేళ కాకపోతే రేపు వెళతాం. వాడు వెళ్ళకపోతే పరీక్షలకు కూర్చోపెట్టరు. వాడి భవిష్యత్తు ముందా? మా యాత్రలు ముందా?"

అంది మాణిక్యం.

సత్యం ఆమ్మ కళ్ళల్లోకి చూడలేక పోయాడు.

మాధవరావు నిట్టూర్పు విడిచాడు.

◆ ◆ ◆

తెరలు తెరలుగా వస్తున్న మాణిక్యం దగ్గుకు ప్రక్కన కూర్చున్న మాధవరావు గతంలోంచి వాస్తవానికొచ్చాడు.

నెల రోజుల నుండి జబ్బుతో చిక్కి మంచం మీదున్న భార్య వైపు చూసాడు. అప్రయత్నంగా కంటనీరు నిలిచింది మాధవరావుకు. ఎన్ని మందులు వాడినా ఏ రోజు కారోజు మాణిక్యం పరిస్థితి క్షీణిస్తుందే కాని తేరుకోవడం లేదు.

ఇక బ్రతకడం కష్టమని డాక్టరు చెప్పే సరికి మాధవరావు పిచ్చెక్కిన వాడిలా తయారయ్యాడు.

కంటనీరులో బేలగ చూస్తున్న భర్తను చూసి మాణిక్యం మృత్యువు వాకిట నిలబడి చిన్నగా నవ్వింది. ఆ సమయంలో ఆ నవ్వు లోని ఆంతర్యం ఎవరికీ అర్థం కాలేదు.

"నాకేమీ జరగలేదు. మీరెందుకు బాధ పడతారు"

ఆ నవ్వులో మిళితమైయున్న భావాన్ని నలభై ఏళ్ళు ఆమెతో జీవితం పంచుకున్న మాధవరావు గ్రహించగలిగాడు.

అంత బాధలో మాణిక్యం అన్న మాటలు

# కోరిక

మాధవరావు గుండెలో వేయి ఫిరంగుల మోత మోయించాయి.

"వాళ్ళు కాశీ వెళుతున్నారా"

మాధవరావు భార్య కళ్ళల్లోకి చూసాడు.

"మాణిక్యం... నన్ను క్షమించు. ఇల్లు, పిల్లలు తప్ప మరో ప్రపంచాన్ని నీకు చూపించ లేకపోయాను. కష్టాలలోని బాధను చూపించ గలిగాను గాని సుఖంలోని ఆనందాన్ని ఇవ్వలేక పోయాను. నీకు జబ్బు నయమవుతుంది. అప్పుడు నిన్ను కాశీ తీసుకువెళతాను."

మాధవరావు హృదయం ఆవేదనతో నిండి పోయింది.

అతని గుండె లోతుల్లోంచి వచ్చిన మాటలవి.

అయితే అవి నిజాలా... నచ్చినిజాలు..

ఆమెపై గల ప్రేమకు ప్రతిబింబాలు...

కానీ... వాటిని వాస్తవం చెయ్యగల స్థితి దాటిపోయింది.

క్షణాలను లెక్కిస్తున్న ఆమెకు ఆ క్షణంలో ప్రపంచం అతని చేతిలో ఉంటె అంతా చూపించెయ్యగలడు.

కానీ... అది సాధ్యమా... మానవుడు... అందులో మధ్య తరగతి మానవమాత్రుడు.

## స్థితి

ఊపిరిలో

ఊహలలో

ఉదయంలో

హృదయంలో

కదిలితే కదిలితే రగిలితే

పగిలితే నీ వెవరవు ?

నేనే నువ్వయితే

మాట లెందుకు ?

కాకుంటే – మౌనమెందుకు ? –

— కేఎస్వీ

భర్త చేతులను తన చేతుల్లోకి తీసుకుని కళ్ళ కద్దుకుంది.

కన్నీటితో అతని చేతులు తడిసాయి.

"నాకే యాత్రలు వద్దండీ. ఇన్నాళ్ళూ పిచ్చి కోరికతో మిమ్మల్ని బాధ పెట్టాను. నన్ను మీరే క్షమించాలి. మీ చేతిలోనే నా చివరి యాత్ర సాగిపోవాలి అదే నాకు కావాలి."

మాణిక్యం నోట్లోంచి కష్టంగా వచ్చాయీ మాటల

అందరివైపు చూసింది నెమ్మదిగా.

అంతే... ఆమెలో మార్పులు.

అంతా చూస్తున్న కొడుకులు, కూతుర్లు, కోడలు దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు

నలభై ఏళ్ళు భర్త నీడలో నీడగ మెదిలిన మాణిక్యం అతని నీడలో నీడగ నిశ్చలంగా ఉండిపోయింది.


చలనంలేని ఆ నీడ మాధవరావు గుండెల్లో జాడగ మిగిలిపోయింది.

* * *

మాణిక్యం పోయిన మూడోరోజునే చిన్న చేతిసంచి పట్టుకుని ఎక్కడికో బయలు దేరుతున్న మాధవరావును వింతగా చూసారు ఇంట్లో అందరూ. మూడ్రోజులు నుండి ఎవరు ఎంత బ్రతిమాలినా నోట్లో ఏమీ వెయ్యని తండ్రి అలా హఠాత్తుగ ప్రయాణ మవుతుంటె సత్యానికి భయమేసింది.

"నాన్నగారూ...ఈ సమయంలో మీరు."

సత్యం మాటలు పూర్తికాక ముందే



మాధవరావు విష్పగా నవ్వి కొడుకువైపు చూసాడు.

"సత్యం ... వలభై ఏళ్ళు నాతో సంసారం చేసి నన్నే సర్వస్వమనుకున్న మీ అమ్మకు కష్టాన్ని తప్ప సుఖాన్ని ఇవ్వలేకపోయాను. బ్రతికుండగా ఏ కోరికా తీర్చలేకపోయాను. చనిపోయిన మీ అమ్మకు భర్తగా నేనొక మంచి పని చెయ్యాలనుకుంటున్నాను. ఆ విధంగా నైనా స్వర్గంలోనున్న మీ అమ్మ నన్ను క్షమిస్తుంది. బ్రతికుండగా తీర్చలేని ఆమె కోరిక చనిపోయిన తరువాత ఎందుకు నెర వేరుస్తున్నాను?...నా స్వార్థం కోసం ... నా స్వార్థం ఏమిటో తెలుసా ... మళ్ళీ జన్మ ఉంటే మీ అమ్మే నాకు భార్య కావాలి.

నాతో ఉన్నంత కాలం ఆమె కోరిక తీర్చ లేని నా అసమర్థతను ఏనాడూ వేలెత్తి చూపించలేదు. నేనంటె అంత ప్రేమ మీ అమ్మకు. ఇప్పుడు కూడా ఆ కోరిక నెర వేర్చకపోతే నా మాణిక్యం నన్ను క్షమించదు."

అతని మాటలు ఎవరికీ అర్థంకాలేదు.

"మామయ్యగారూ ... మీరేం చెబు తున్నారో మాకెవరికి అర్థమవడం లేదు. అత్తగారు పోయిన దుఃఖంలోంచీ ఇంకెవరూ తేరుకోలేదు. ఇప్పుడు మీరు కూడా దూరమై మమ్మల్ని బాధ పెట్టకండి" అంది కమల కన్నీటితో.

అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ల నిలిచాయి మాధవరావుకు.

"కమలా ... కూతురులాంటి నిన్ను, కూతుళ్ళను, కొడుకులను, అల్లుళ్ళను, మనవరాళ్ళను, మనవడిని చూసి మురిసి పోయింది మీ అత్త. ఏ లోటు కలగలేదు. కానీ ఏనాడూ ఏదీ కోరని నా మాణిక్యం కోరిన ఒక కోరికను నేను తీర్చలేకపోయాను. అందుకే ఈ రోజు నెరవేర్చాలనుకున్నాను ఎవరినీ బాధ పెట్టాలని కాదు... నా తృప్తి కోసం."

"అయితే... మీరు"

"సత్యం... ఈ రోజు నేను కాశీ వెళుతున్నాను. నేను ఒక్కడినే కాదు... నా మాణిక్యాన్ని కూడా తీసుకెళుతున్నాను."

## కోరిక

అని సంచిలోంచి చిన్న మూట తీసి చూపించాడు.

అందరూ కొయ్యబారిపోయారు.

మాణిక్యం అస్థికలవి.

"నాన్నగారూ!"

సత్యం తండ్రి కాళ్ళమీద పడ్డాడు.

కొడుకును హృదయానికి హత్తుకున్నాడు

"నాన్నగారూ... అమ్మ కోరిక తీరకపోవ డానికి నాకూ కొంత భాగం ఉంది. మిమ్మల్ని ఈసారి ఎంత డబ్బు అయినా సరే, ఎవరి కాళ్ళైనా పట్టుకుని తెచ్చి పంపిస్తాను. ఈ ఒక్కసారి మన్నించండి."

"వద్దు సత్యం... అప్పు చెయ్యవలసిన అవసరం లేదు. మీ అమ్మే దారి చూపించింది. పునిస్త్రీగ వెళ్ళిపోతూ వలభై ఏళ్ళ క్రితం నేను కట్టిన మంగళసూత్రం, తాడు ఈరోజు నాకిచ్చి వెళ్ళిపోయింది మీ అమ్మ. ఇప్పుడు దానిని మీ కెవరికి చెప్పకుండా అమ్మేసి ఆ డబ్బుతో కాశీ వెళుతున్నాను. నేను చేసిన ఈ దౌర్భాగ్యపు పనికి మీరు నన్ను హేళన చెయ్యవచ్చు. కానీ నా మాణిక్యం నన్ను సమర్థిస్తుంది.

ఆమె కోరిక ఆమె సంపదతోనే తీరుస్తున్నాను.

నన్ను నా మాణిక్యం క్షమిస్తే కాశీలో మేమిద్దరం కలుసుకుంటాం."

అని అందరినీ చివరిసారిగ తృప్తిగ చూసి అందరూ కన్నీళ్ళతో చూస్తుండగా సంచి చేతపట్టుకుని ఇంట్లోంచి బయటకు వచ్చాడు మాధవరావు. ★

## హృది దీపాలు వెలగనీ!

నరకాసురుల వారి తల తెగి
ధరణిపై దొర్లిపడిన వేళ
రక్కసి రక్తం చిందింది – అది జగతి
పక్కలోపడి తడిసింది నేల.
అందుండి ఆవిర్భవించెనట – క
బంధ హస్త శత సహస్రమ్ము,
దౌర్జన్యం – హింస నల్లబజారు;
గర్జిస్తున్నాయి నేటికవి నిజమ్ము,
లేకుంటే –
బుద్ధుడు పుట్టిన భూమిపై – ఆటు
గద్దెల కోసం హింసాకాండలా!

గాంధీ పుట్టిన నేలపై – ఇటు
సామాన్యుడికి దిన దిన గండాలా!
కబంధ హస్తాల తెగ్గదెంచ – శ్రీ
కృష్ణులై రథమెక్కండి నేడు.
గుడిసె వాసులకు గూడ – అందరూ
కడిగి, దీపావళి నందించండి నాడు.

సమస్యల నరకాసురుని తల నరకండి
సామాన్యుని హృది దీపాలు వెల్గగా!
దీపావళి నిండుగా మనసుల్లో – ఆనంద
దీపాల స్థావరం కావాలి శాశ్వతంగా!

కాణిపాకం లింగన్న

